COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ఈరోజు (2 ఏప్రిల్) సిపిఐ(యం) కేంద్ర కమిటీ ప్రకటనను విడుదల చేసింది. ఆ కాపీని ప్రచురణార్థం/ ప్రసారార్థం పంపుతున్నాము. **- జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

## కరోనాపై పోరుకు
## మతం రంగు పులిమే యత్నాలు ఆపండి

**- సిపిఎం పొలిట్‌బ్యూరో**

ఢిల్లీలో తబ్లిగి జమాత్ సమావేశాలకు పెద్ద సంఖ్యలో హాజరై, దేశంలోని వివిధ ప్రాంతాలకు తిరిగివెళ్లిన వారిలో ఎక్కువ మందికి కరోనా సోకడం ఆందోళనకరమైన విషయమని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒక కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో కరోనాపై యుద్ధానికి మతం రంగు పులిమేందుకు జరుగుతున్న యత్నాలను పార్టీ ఖండించింది. నలుగురు కన్నా ఎక్కువ మంది ఒకచోట గుమికూడరాదని ఆంక్షలు అమల్లో వున్నప్పటికీ మార్చి మధ్యలో ఇటువంటి సమావేశాలను నిర్వహించడం జమాత్ నాయకత్వం బాధ్యతారాహిత్యమని విమర్శించింది. అయితే మార్చి 20-21 తేదీల్లో రెండో విడత సమావేశానికి అధికారులు ఎలా అనుమతించారో అర్థం కావడం లేదని పేర్కొంది.

కరోనా వైరస్‌కు మతపర తేడాలు ఉండవని, దీనికి మతం రంగు పులిమేందుకు జరుగుతున్న యత్నాలను విధిగా తిప్పికొట్టాలని కోరింది. 200 మంది కన్నా ఎక్కువ మంది సమావేశం కావడాన్ని నిషేధిస్తూ మార్చి 13న ఆదేశాలు జారీ అయిన తర్వాత కూడా దేశంలోని పలు ప్రాంతాల్లో సామాజిక, రాజకీయ, మతపరమైన పెద్ద పెద్ద సమావేశాలు జరిగాయని, వాటిపై కూలంకషంగా దర్యాప్తు జరగాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ సమావేశాలకు హాజరైన వారిని గుర్తించి, పరీక్షలు జరపాలని కోరింది.

ఇలాంటి పెద్ద పెద్ద సభల్లో పాల్గొన్నవారిని గుర్తించి, వారికి పరీక్షలు జరిపి, ఐసోలేషన్‌లో ఉంచి, వైరస్‌ను అదుపుచేయడంలో దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల అనుభవాల నుండి పాఠాలు తీసుకోవాలని సూచించింది. కరోనా పరీక్షల విషయంలో దక్షిణ కొరియాతో పోలిస్తే భారత్‌లో చాలా తక్కువ. అంటే దక్షిణ కొరియా కన్నా 241 రెట్లు తక్కువ అని సిపిఎం గుర్తు చేసింది. దీన్ని వెంటనే అత్యవసరంగా పరిష్కరించాలని కోరింది.

ఇదీ, కరోనా వైరస్‌పై భారత్ సాగిస్తున్న పోరాటం! ఈ పోరాటానికి మతం రంగు పులుముతూ దీన్ని మతోన్మాదంగా చిత్రీకరించడానికి జరుగుతున్న ప్రయత్నాలు, వైరస్‌ను కట్టడిచేయడంలో మనం ప్రారంభంలో సాధించిన విజయాన్ని తక్కువ చేసి చూడ్డమే అవుతుందని పేర్కొంది. ఇది స్వయంకృతాపరాధమే అవుతుందని పేర్కొంది. ఇటువంటి ప్రమాదకరమైన మత సమీకరణలకు స్వస్తి చెప్పేలా అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాలకు, రెచ్చగొట్టే చర్యలకు లోనుకాకుండా కరోనా మహమ్మారిని ఓడించడానికి సమైక్యంగా శాయశక్తులా పోరాడుదామని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

= = = =